## మున్సిపల్ సమస్యలపై బీజేపీ వినతి వెంటనే పరిష్కరించాలి: కొండ హరీష్ గౌడ్



**డైనమిక్ న్యూస్, హుజూర్ నగర్** హుజూర్ నగర్ పట్టణంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న త్రాగునీరు, పారిశుధ్యం, రోడ్ల దుస్థితి, దోమల బెడద, వీధి కుక్కలు, కోతుల సమస్యలపై బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో కనీస వసతులు కూడా సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మరియు మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చింతలపూడి ఉమామహేశ్వరరావు, జిల్లా నాయకులు ఆకుల భిక్షమయ్య, చిత్తలూరి సోమయ్య, మేళ్లచెరువు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ ఎన్నికలకు పటిష్ట భద్రతా చర్యలు

ఎస్పీ కె. నరసింహ




**సూర్యాపేట బ్యూరో, డైనమిక్ న్యూస్** మున్సిపాలిటీ ఎన్నికలను ప్రశాంతంగా, న్యాయంగా నిర్వహించేందుకు జిల్లాలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె. నరసింహ తెలిపారు. ఈ మేరకు పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి, హుజూర్నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా పని చేయాలని, గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడ్డ వారిని గుర్తించి ముందస్తుగా 5 లక్షల వరకు బైండోవర్ చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో లైసెన్స్ ఆయుధాలు స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను ముందుగానే పరిశీలించి తగిన ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల సామాగ్రికి పూర్తి భద్రత కల్పించాలని సూచించారు. ఫ్లాగ్ మార్చ్‌ల ద్వారా ప్రజల్లో నమ్మకం పెంచాలని, అక్రమ రవాణా, నిషేధిత వస్తువుల తరలింపుపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియను ఎలక్షన్ సెల్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. మున్సిపాలిటీల్లో నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొంటూ, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు.

## దళితులపై దాడులు అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలం కొమ్ము చంద్రశేఖర్



**డైనమిక్ న్యూస్, మాచర్ల** మాచర్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ము చంద్రశేఖర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ హయాంలో దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదోని, అద్దంకి, పిన్నెల్లి, నంద్యాల ప్రాంతాల్లో జరిగిన ఘటనలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో సాంఘిక బహిష్కరణలు కూడా కొనసాగుతున్నాయని అన్నారు. దళితులు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే కారణంతోనే వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. హోంశాఖ మంత్రి దళితురాలై ఉండి కూడా దాడులు అరికట్టలేకపోతున్నారని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి దాడులు, అత్యాచారాలను అరికట్టాలని, లేదంటే పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి మాచర్ల సుందర్రావు, కౌన్సిలర్లు మంద సంతోష్, వేల్పుల గురవయ్య, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కందుకూరి మధు, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మాచర్ల పవన్, కొమ్ము బొంగురు, కోట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.30 లక్షల హెల్త్ ఎటీఎం, ఈసీజీ మిషన్ ప్రారంభం

**నల్గొండ జిల్లా ఆస్పత్రిలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆవిష్కరణ**





**డైనమిక్ న్యూస్, నల్గొండ బ్యూరో** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు వేగంగా అందించాలనే లక్ష్యంతో రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హెల్త్ ఎటిఎం ప్రైమ్ టేర్ మిషన్, ఈసీజీ మిషన్‌ను రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండ జిల్లా ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామస్థాయి నుంచే ఆధునిక నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి రావడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ఖరీదైన ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందన్నారు. హెల్త్ ఎటిఎంలో ఈసీజీ, బీపీ, బ్లడ్ షుగర్, పల్స్, ఉష్ణోగ్రత, ఆక్సిజన్ సాచ్యురేషన్ వంటి పరీక్షలు తక్కువ సమయంలో నిర్వహించవచ్చని తెలిపారు. గ్లాకోమియా వంటి కంటి పరీక్షలు కూడా చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రివెంటివ్ హెల్త్ కేర్ బలోపేతం చేసి, హృదయ సంబంధిత వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఈ సదుపాయాలు దోహదపడతాయని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి హెల్త్ ఎటిఎంలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎస్పీ శరత్ చంద్ర పవర్, ఇంచార్జ్ కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, సూపరింటెండెంట్ నేత నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ సీట్లు బీసీలకే కేటాయించాలి

**నేరేడుచర్ల అభ్యర్థుల ఎంపికలో మంత్రి మౌనం విడాలి**

**బీసీ హక్కుల సాధన సమితి**



**నేరేడుచర్ల, డైనమిక్ న్యూస్** నేరేడుచర్ల మున్సిపాలిటీలో బీసీలకు రిజర్వ్ అయిన మూడు వార్డులను పూర్తిగా బీసీలకే కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీకాంతాచారి భవన్‌లో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూడ నేరేడుచర్ల మున్సిపాలిటీలో సుమారు 14 వేల ఓట్లలో దాదాపు 7 వేల ఓట్లు బీసీలవని గుర్తు చేశారు. అయితే బీసీలకు రిజర్వ్ అయిన మూడు వార్డుల్లో 11, 12 వార్డులను ముస్లిం మైనార్టీలకు కేటాయించి, బీసీలకు ఒక్క వార్డు మాత్రమే ఇవ్వడం అన్యాయమని అన్నారు. మైనార్టీలకు తాము వ్యతిరేకం కాదని, పట్టణంలోని జనరల్ వార్డుల్లో మైనార్టీలకు కేటాయింపులు చేయాలని సూచించారు. బీసీ రిజర్వ్ సీట్లను ఇతర వర్గాలకు ఇవ్వడం సరికాదని స్పష్టం చేశారు. ఈ అంశంపై మంత్రి తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో బీసీలను చైతన్యపరిచి ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యల్లబోయిన సింహాద్రి, జిల్లా గౌరవాధ్యక్షుడు చిలక రాజు శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు రాజు వెంకట్, ఊదర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



**నల్లగొండ బ్యూరో, డైనమిక్ న్యూస్** బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని బొట్టుగూడ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం రూపొందించిన ప్రత్యేక సంచికను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నేడు ఆవిష్కరించారు. కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి స్మారక బొట్టుగూడ పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ సంచికను విడుదల చేశారు. 1975 బ్యాచ్ నుంచి 2012 వరకు పదవ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలపై తమ అనుభవాలు, అధ్యాపకుల బోధనల ప్రాధాన్యం, పాఠశాల నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన వారి వివరాలను ఈ 70 పేజీల సంచికలో పొందుపరిచారు. రాష్ట్ర మంత్రి సందేశంతో పాటు, సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకట రమణ సంపాదకత్వంలో ఈ ప్రత్యేక సంచిక వెలువడింది. ముఖచిత్రాన్ని ప్రముఖ చిత్రకారుడు, పాఠశాల పూర్వ విద్యార్థి కూరెళ్ల శ్రీనివాస్ రూపొందించారు.

## మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్ కేంద్రాలపై కలెక్టర్ పరిశీలన



**సూర్యాపేట బ్యూరో డైనమిక్ న్యూస్** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 28 నుంచి 30 వరకు నామినేషన్లు స్వీకరించనున్న నేపథ్యంలో మంగళవారం సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మూడు వార్డులకు ఒక నామినేషన్ కేంద్రం చొప్పున మొత్తం 16 కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రతి కేంద్రంలో ఆర్వోతో పాటు మూడు ఖాళీ కుర్చీలే ఉంచాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల్లో లైట్లు, ఫ్యాన్లు, ట్రంక్ బాక్స్, కంప్యూటర్ వ్యవస్థ ఉండాలని, అభ్యర్థుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిలో నిబంధనలు పాటించాలని, శాంతిభద్రతల కోసం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, ఈఈ కిరణ్, టిపిఓ సోమయ్య, డీఈ సత్యరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగు విస్తరణపై అధికారుల దృష్టి కేంద్రీకరించాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**డైనమిక్ న్యూస్, సూర్యాపేట బ్యూరో** జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగును ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎక్కువ విస్తీర్ణంలో విస్తరించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఆయిల్ ఫామ్ సాగుపై హార్టికల్చర్, వ్యవసాయ, ఆయిల్ ఫెడ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి గాను 3 వేల ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 868 ఎకరాల్లో సాగు జరిగిందని తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని, మండల స్థాయిలో రైతుల వివరాలు సేకరించి కొత్త ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. అలాగే రెండు వారాల్లో ఆయిల్ ఫెడ్ కంపెనీకి జిల్లా బృందాన్ని తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలో యూరియా సరఫరాకు కొత్త యాప్ ప్రారంభం సందర్భంగా ఏఓ, ఏఈఓ, ఎంఈఓలతో వెబ్ ఎక్స్ సమావేశం నిర్వహించి, యాప్ అమలుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఏఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి నాగయ్య, ఆయిల్ ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అంగన్వాడీ టీచర్‌కు ఘన సన్మానం




**డైనమిక్ న్యూస్, హుజూర్‌నగర్** సూర్యాపేట జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అంగన్వాడీ టీచర్ అవార్డు అందుకున్న సందర్భంగా, ప్రస్తుత విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో టీచర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ, చిన్నారుల అభివృద్ధి కోసం టీచర్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో కుక్కడపూ మహేష్, కారింగుల వెంకటేశ్వర్లు, పోటు సాగర్, పోటు జ్యోతి, వసంత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆత్మబంధువు ఉత్తమ్

**సిఎంఆర్ఎఫ్ చెక్కును అందించిన సర్పంచ్ బుజ్జి మోతిలాల్**



**పాలకవీడు జనవరి27 (డైనమిక్ న్యూస్)** గిరిజనుల, పేదల పాలిట ఆత్మబంధువు మంత్రి ఉత్తమ్ అని పాలకవీడు మాజీ జెడ్పిటిసి బెట్టేతండా సర్పంచ్ మాలోతు బుజ్జి మోతిలాల్ అన్నారు. రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమధ ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కును పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు. పాలకవీడు మండలం బెట్టేతండా గ్రామానికి చెందిన మాలోతు సుధీర్ కు రూ 60 వేలు మంజూరి కాగా చెక్కును పంపిణీ చేశారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికే కాకుండా ఎవరికి ఏ చిన్న కష్టం వచ్చినా నేనున్నానంటూ మంత్రి ఉత్తమ్ సహాయ సహకారాలు అందిస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేష్, శివ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మాధవ రాయిని గూడెంలో ఎన్ఎస్ఎస్ శిబిరం



**డైనమిక్ న్యూస్, హుజూర్ నగర్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుజూర్నగర్ ఎన్ ఎస్ ఎస్ శీతాకాలం ప్రత్యేక శిబిరం మాధవ రాయుని గూడెం , మర్రి గూడెం లో 108 సిబ్బంది సి పి ఆర్ మీద ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు మరియు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. రామారావు,ప్రోగ్రాం అధికారులు బాలరాజు, నాగార్జున , 108 సిబ్బంది బి. రవి కుమార్, నరహరి, మహేష్ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సునంద, ప్రియాంక, డా.నగేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు

## శ్రీ స్వామి వారికి నిత్యాకల్యాణం



**మఠంపల్లి, డైనమిక్ న్యూస్** సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి మహాక్షేత్రం నందు మంగళవారం శ్రీ స్వామి వారికి ప్రాతఃకాలమున నిత్యాభిషేకములు, నిత్య హోమములు జరిగినవి. తదుపరి నిత్య కళ్యాణం దేవాలయ అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, ఫణి భూషణ మంగాచార్యులు, పద్మనాభా చార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయ చార్యులు వార్లచే శాస్త్రోక్తముగా నిర్వహించబడినది. ఈ రోజు దేవాలయం అన్నదానంలో 110మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగినది.

## ప్రజా సమస్యల కోసం నిరంతరం పని చేస్తా కన్నెకల్ సర్పంచ్ సర్నాల నాగరాజు



**డైనమిక్ న్యూస్ మాడుగులపల్లి :** నాగార్జునసాగర్ నియోజకవర్గం మాడుగులపల్లి మండల పరిధిలోని కన్నెకల్ గ్రామపంచాయతీలో బొడ్రాయి సమీపంలో మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలిపోవడంతో నీరు మొత్తం లీకేజీ తో ఏర్పడి రోడ్డు మీదకి వెళ్లడంతో రహదారిపై వెళ్లే ప్రయాణికులు జారి కింద పడుతున్న పరిస్థితి ఉండడంతో ఆ యొక్క సమస్యను గ్రామ ప్రజలు గ్రామ సర్పంచ్ సర్నాల నాగరాజు దృష్టికి తీసుకువెళ్లగానే వెంటనే స్పందించి రోడ్డుపై వెళ్ళే వాహనదారులు ఇబ్బందులకు గురి కావద్దని సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఉపసర్పంచ్ గోగుల మౌనిక శ్రీను మరియు గ్రామంలో ఉన్నటువంటి యూత్ తో స్వయంగా సర్పంచ్ పారపట్టి కాలువ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు గ్రామ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజల కొరకు అందుబాటులో ఎల్లవేళలా ఉంటూ సమస్యను వెంటనే పరిష్కరించడంతో పలువురు అభినందించారు.

